(మినీకథ)

# ధర్మభూమి

- పాణ్యం దత్తశర్మ



పరంధామయ్య ఆరాత్రే హఠాత్తుగా గుండెపోటుతో మరణించారు. బంధువులకు టెలిగ్రాములు వెళ్ళాయి. ఫోన్లుచేశారు వచ్చినవాళ్ళు వచ్చారు. ఇంతలో ఆయన పెద్దకొడుకు ఆయన దిండు క్రింద ఏదోకాగితంచూశాడు. ఏమిటేమిటన్నారు. అందులో, చనిపోయే ముందు ఇలా వ్రాశారాయన.

"మొదటినుండీ నేను, నా కుటుంబం అన్న పరిధిలోనే బ్రతికాను. జీవితం చరమదశలో ఏదైనా మంచిపని చేయాలనుకుంటూనే ఏదీ చేయలేకపోయాను. నిన్ననే ఒక నిర్ణయం తీసుకున్నాను. నేను చనిపోయింతర్వాత నా కళ్ళను దానం చేయాలని నా చివరికోరిక. రోజూ ఉదయం మనింటికి ఒక గుడ్డి బిచ్చగాడు వస్తూంటాడు. వాడిపేరు బైరాగి. వాడివెంట ఒక కుర్రవాడు, వాడి కొడుకు, వాడికి ఊతగా వుంటాడు. వూరిచివర చలమయ్యగారి సత్రంలో ఉంటారు వాళ్ళు. ఆ గుడ్డివాడు నా కళ్ళతో చూడగలగాలి. ఇది నా చివరికోరిక. దీన్ని తీరిస్తే నా ఆత్మ ప్రశాంతంగా పరలోకాలకు వెళుతుంది.

ఆది చదివి కొడుకులంతా ముఖా ముఖాలు చూసుకున్నారు. శవానికి కళ్ళు తీసేయటం తాను చస్తే ఒప్పుకోనన్నది వాళ్ళమ్మ. ఇలాంటి చచ్చు సెంటిమెంట్లే లేకపోతే ఈ ప్రపంచంలో ఎంతోమంది గ్రుడ్డివాళ్ళు చూపు నోచుకొనేవారు.

పరంధామయ్య చిన్న కొడుకు సంస్కారవంతుడు. "చనిపోయింతర్వాతకూడ ఇలాంటి పట్టింపులేమిటి? నాన్నగారు తీసుకున్న నిర్ణయం అతి విశిష్టమైంది. ఆయన కోరిక తీర్చకపోతే ఆయన ఆత్మ క్షోభిస్తుంది. ఇప్పుడే మన ఫామిలీ డాక్టరు ధన్వంతరిగార్కి ఫోన్‌చేస్తాను." స్థిరమైన అతని మాటలకు ఎవరూ జవాబు చెప్పలేకపోయారు.

డాక్టర్ ధన్వంతరి వచ్చారు. విషయం చెప్పారాయనకు. ఆయన పరంధామయ్యగారి హృదయ వైశాల్యానికి జోహార్లర్పించారు. వెంటనే ఆ గుడ్డివాడిని కలిసి, వాడికి కళ్ళు అమర్చే ప్రయత్నం జరగాలన్నారు.

డాక్టరుగారికారులోనే, కొడుకులూ, ఆయన, చలమయ్యగారి సత్రానికి వెళ్ళారు. ఇంకా తెల్లవాలేదు. అక్కడ పడుకున్న బిచ్చగాళ్ళు సత్రంముందు కారుఆగటంచూసి ఆశ్చర్యపోయి చూడసాగారు.

"ఇక్కడ బైరాగి అనే గుడ్డివాడున్నాడా"? ఎవరో బైరాగిని లేపారు.

వచ్చినవాళ్లెవరో అర్థంకాక, "ఎవరుబాబూ?" అన్నాడువాడు.

"నీ అదృష్టం పండిందోయ్ అన్నాడు డాక్టర్ గారు :! కోవెలవీధి పరంధామయ్యగారింటికి రోజూ ముష్టికి వెళుతుంటావటకదా ఆయన మరణించారు. చనిపోతూ, నీకు తన కళ్ళను దానం చేశారు. నీవు వెంటనే ఆసుపత్రికి రావాలి. నీకు ఆయన కళ్ళను అమరుస్తాం. నీవికనుండి చక్కగా చూడొచ్చు"

గుడ్డివాడు కొన్ని క్షణాలు ఏమీ మాట్లాడలేదు. ఎగిరిగంతేస్తాడనుకున్న వాళ్ళకు అతడి వాలకం వింతగా తోచింది. తన గుడ్డికళ్ళను తాటిస్తూ ఇలా అన్నాడు బైరాగి.

"కంటిసూపిచ్చి సనిపోయినాడా పరంధామయ్య బాబు. రోజూ లేదనకుండా బిచ్చమేసేవాడు కానీ బాబూ, సూపు నాకెందుకు? మా తాత గుడ్డోడు. మా అయ్య గుడ్డోడు అల్లు సచ్చేలోపు జిల్లేడుపాలు మాకళ్ళల్లో పిండి మా సూపు పోగొట్టి సచ్చారు. అందుకే అందుకే నాకియ్యాల ఇంతకూడు దొరుకుతుంది. ఈబొట్టిడున్నాడు. ఈనికే నేను పొయ్యేలోపు కల్లుపొడిసో, కాలు ఇరిసో, బుక్తిమార్గం సూపాల. లేకపోతే మాలాటోల్లు బదికేదెట్ల బాబూ? సెమించండి బాబూ, నాకు సూపొద్దు. నాకడుపుమీద కొట్టకండి".

వాళ్ళు నిశ్చేష్టులై చూస్తుండగా కర్ర తాటిస్తూ కొడుకుతోబాటు అడుక్కోడానికి వెళ్ళిపోయాడు బైరాగి.

కన్నో కాలో లేకపోతేనేగాని ధర్మం చేయని ధర్మభూమి మనది మరి!

